సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 19 | మే | 2025



ముగిసిన నెట్‌బాల్ పోటీలు

జనగామలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి.

- 8లో▸



అన్నదానం..మహాప్రసాదం

సరస్వతి నది పుష్కరాలకు వచ్చే భక్తులకు కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ సమీపంలో అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $37^0/27^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

రేపటి నుంచి పీజీ కోర్సుల పరీక్షలు

- 26 పరీక్ష కేంద్రాలు.. 4,300 మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్(నాన్ ప్రొఫెషనల్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య సౌజన్య ఆదివారం తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 20, 22, 24, 27, 29, 31 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కేయూ పరిధిలో పీజీ కోర్సుల పరీక్షల నిర్వహణకు 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,300 మంది పరీక్షలు రాయనున్నట్లు వారు తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత



వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రాంతంలో ఆదివారం ఓ కల్యాణ మండపంలో బాలికకు వివాహం జరుగుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం పోలీసులు, చైల్డ్‌లైన్ అధికారులు సంయుక్తంగా అక్కడికి చేరుకుని బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలిక, యువకుడి తల్లిదండ్రులను సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపర్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. చిన్నవయస్సులో పెళ్లి చేస్తే తీవ్ర అనర్థాలు కలుగుతాయన్నారు.

అత్యాధునిక వసతులతో రైల్వే స్టేషన్



ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ తరహాలో అత్యాధునిక హంగులు, వసతులతో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఆదివారం వరంగల్ రైల్వేస్టేషన్‌ను మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, అరూరి రమేశ్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.25.41 కోట్ల వ్యయంతో చేపట్టిన రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రత్న సతీశ్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, తాబేటి వెంకట్‌గౌడ్, బన్న ప్రభాకర్, ఎరుకుల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్ కుమార్, గోకే వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీకెంత.. నాకెంత?

సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాలాల పూడికతీత పనుల్లో చేతివాటం తంతుగా మారింది. ఇప్పటికే ప్రతీ పనికి 'నీకెంత.. నాకెంత'లా సాగుతున్న పర్సంటేజీల దందాపై కొందరు కార్పొరేటర్లు, జీడబ్ల్యూఎంసీ అధికారులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. నగరం వరద ముంపునకు గురికాకుండా ముందస్తుగా చేపట్టే నాలాల పూడికతీత పనుల్లోనూ కమీషన్ల దందా కలకలం రేపుతోంది. ప్రతీసారి ఆలస్యంగా మొదలుపెట్టే ఈ పూడికతీత పనులు సాగుతున్న తీరు చూస్తే నిజంగానే పూడికతీత కోసమా? లేక నిధుల మేత కోసమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్లుగా నాలాల క్లీనింగ్ అరకొరగానే సాగుతోంది.

అంచనాలు పెంచి..

కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రైసిటీస్‌లో ప్రధాన నాలాలతో పాటు అంతర్గత నాలాల పూడికతీత కోసం బల్దియా ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నది. ఆరేళ్లలో సుమారు రూ.9.49 కోట్ల వరకు ఖర్చు చేసిన అధికారులు.. గతేడాది సైతం రూ.2.32 కోట్లు వరకు వెచ్చించారు. అంతకు ముందు సంవత్సరం రూ.1.24 కోట్లుంటే.. చాలాచోట్ల అంచనాలు పెంచి రూ.2.32 కోట్లకు చేర్చారన్న విమర్శలు వచ్చాయి. ప్రధాన నాలాలతో పాటు 42 అంతర్గత నాలాల్లో పూడిక తీతకు డబ్బులు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఆ డబ్బును గ్రేటర్ వరంగల్‌లోని కొందరు ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లు అందరినీ 'సమన్వయం' చేసి 'లెక్కలు' తేలిన పిదపే పనులు ప్రారంభించారన్న చర్చ కూడా ఉంది. ఈసారి కూడా సుమారు కోటిన్నరకు పైగా పూడికతీత పనులకు వెచ్చిస్తున్న బల్దియా చాలాచోట్ల నామినేషన్ పద్ధతిన పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అడుగడుగునా నిర్లక్ష్యం..

శంభునిపేట, ఏకశిలానగర్, శివనగర్, ఉర్సు డీకే నగర్, కరీమాబాద్ సాకరాశికుంట, 12 మోరీలు, రామన్నపేట, హంటర్‌రోడ్డు, ఉర్సు బొడ్రాయి, తిరుమల జంక్షన్, వడ్డేపల్లి, ప్రశాంత్‌నగర్, నయీంనగర్, చైతన్యపురి కాలనీ ప్రాంతాలతో పాటు వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధి పలు డివిజన్లలో పూడికతీత పనులు చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో పనుల్లో పారదర్శకత కోసం కొత్తగా యాప్‌ను రూపొందించి జీపీఆర్ఎస్, జియో ట్యాగింగ్ పద్ధతిని కూడా కొన్నిచోట్ల ఉపయోగిస్తున్నారు. ఇదిలా ఉంటే చాలాచోట్ల నాలాల పూడికతీత పనులు జేసీబీ, హిటాచీ యంత్రాలతో పైపైన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దగ్గరుండి పని చేయించాల్సిన ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండడం లేదు. దీంతో అడుగు భాగంలో పేరుకుపోయిన మట్టి(సిల్ట్)ని మాత్రమే తీసి ఇతర వ్యర్థాలను వదిలేస్తున్నారని నగరవాసులు చెబుతున్నారు. ఇటీవల వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పర్యటించిన నగర మేయర్ గుండు సుధారాణి పూడికతీత పనులు పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పూడికతీత పనుల్లో కమీషన్ల వేట

- 'గ్రేటర్'లో కొనసాగుతున్న తంతు
- ఏటా రూ.కోట్లు తగలేస్తున్న 'బల్దియా'
- మొక్కుబడిగా పనులు.. నామమాత్రంగా తనిఖీలు
- గత అక్రమాలపై ఫిర్యాదులు.. తేల్చని 'విజిలెన్స్'



వరంగల్ శంభునిపేట, ఏకశిలానగర్ ప్రాంతాల్లో పూడిక తీస్తున్న దృశ్యం



పూడికతీత పనులు పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి(ఫైల్)

'విజిలెన్స్' విచారణ బుట్టదాఖలు

ఎప్పటిలాగే ఈసారి కూడా పనులను ఆలస్యంగా మొదలెట్టారు. జూన్ 2 నుంచే వర్షాలు పడతాయని వాతావరణశాఖ స్పష్టం చేసినా పూడికతీత పనులు వేగంగా సాగడం లేదు. సగం పనులు పూర్తయ్యేలోపే వర్షాలు పడితే గతంలో మాదిరిగానే ఈసారి విడుదలైన నిధుల్లో సగానికి పైగా స్వాహా అయ్యే అవకాశాలు ఉన్నాయని బల్దియా అధికారులు, కార్పొరేటర్లే అంటున్నారు. పూడికతీత పనుల్లో అక్రమాలు జరిగాయంటూ గతంలో కొందరు మాజీ కార్పొరేటర్లు, పౌరుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. చర్యలు మాత్రం లేకపోవడంతో నిధుల దుర్వినియోగం సర్వసాధారణంగా మారింది.

లక్ష్యం మేరకు పూడిక తీయట్లేదు..



భద్రకాళి చెరువు మరింత లోతు పూడిక తీయాల్సింది. 3లక్షల క్యూబిక్ ఫీట్లు పూడిక తీయాల్సి ఉండగా సగం కూడా పూర్తికాలేదు. అధికారులు మాత్రం 70శాతం అయ్యిందని మంత్రులను కూడా తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలా అయితే వర్షాకాలంలో చెరువునిండి నీరు బయటకు వస్తుంది. వర్షాలుపడే లోపే పూడికతీత పూర్తిచేయాలి. భద్రకాళి చెరువులోకి డ్రెయినేజీ నీరు రాకుండా గోడ నిర్మించాలి.

- పుల్లూరు సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు

డైక్ కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యం

- విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు సంతకాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల డిమాండ్



సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైక్)లో కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొద్ది నెలల నుంచి సిబ్బంది అసలు విధుల్లో లేకుండానే విధులకు హాజరైనట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారు. ఇంకా కొన్ని సందర్భాల్లో ఏకంగా విధులకు హాజరవ్వకుండా డైక్ సెంటర్‌కే తాళం వేసిన ఘటనలున్నట్లు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. సిబ్బంది విధులకు డుమ్మా కొడుతుండడంతో బాధిత పిల్లలకు సేవలు ఎలా అందిస్తారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డైక్ సెంటర్ కాంట్రాక్ట్ సిబ్బందిలో ఓ ఉద్యోగిని ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రముఖ దినపత్రిక చీఫ్ బ్యూరో నా చుట్టం.. మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ.. చిందులు తొక్కుతుండడం గమనార్హం. ఎంజీఎం డైక్ సెంటర్‌లో అర్హత లేని వ్యక్తులు ఉద్యోగాలు పొందారని, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగ నియామకాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డైక్ సెంటర్ కాంట్రాక్టు సిబ్బంది తీరు, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలంటూ ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

టీచర్లకు నైపుణ్య శిక్షణ

ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు

- రెండో దశలో ఎస్‌ఏలకు..
- మెరుగైన బోధనే లక్ష్యంగా ట్రైనింగ్

విద్యారణ్యపురి: విద్యాబోధనలో నైపుణ్యాల్ని పెంచేలా జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్లు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రిసోర్స్ పర్సన్లు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. సబ్జెక్టుల బోధనను మెరుగుపర్చుకునేలా జీవన నైపుణ్యాలు లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంపుదలకు ఈశిక్షణ తోడ్పడనుంది. హసన్‌పర్తి మండలం భీమారంలోని స్కిల్‌స్పార్క్‌లో 477 మంది వివిధ సబ్జెక్టుల టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్, ఫిజికల్ సైన్స్, జీహెచ్ఎంలకు, ఎస్‌ఓలకు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వనున్నారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని మాంటిస్సోరి ప్రైమ్ స్కూల్‌లో 470 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. తెలుగు, హిందీ ,బయోసైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇస్తారు. అదేవిధంగా ఉర్దూ లాంగ్వేజ్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు (ఉర్దూమీడియం) మాత్రం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉర్దూ ఉపాధ్యాయులకు హనుమకొండలోని మాంటిస్సోరిలో శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుంది. మధ్యాహ్నం భోజన వసతి, టీస్నాక్స్ కూడా అందజేయనున్నారు. విధిగా వీరంతా శిక్షణకు హాజరుకావాల్సిందే.

మండల స్థాయిలో.. ఎస్జీటీలకు, ఎల్ఎఫ్‌హెచ్‌ఎంలకు శిక్షణ

జిల్లాలోని 14 మండలాల్లో మండల స్థాయి శిక్షణలో ఎస్జీటీలు, ఎల్ఎఫ్‌హెచ్‌ఎంలకు ఈనెల 20 నుంచి 24 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. 1,023 మంది టీచర్లు శిక్షణలో పాల్గొననున్నారు. ఎఫ్ఎల్ఎన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ పాఠాలపై లెర్నింగ్ అవుట్ కమ్స్, లైఫ్ స్కిల్స్, తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. జిల్లా స్థాయిలో ఇటీవల శిక్షణ పొందిన మండల స్థాయి రిసోర్స్‌పర్సన్లు ఈఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల విద్యాశాఖాధికారులు గుర్తించిన శిక్షణ కేంద్రాల్లో శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉండనుంది. వీరికి భోజన వసతి, టీ స్నాక్స్ కూడా అందజేయనున్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య

విద్యారణ్యపురి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) అప్పయ్య అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం సాయంత్రం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి హనుమకొండ ప్రసూతి ఆస్పత్రి వరకు కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకుంటూ ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ఎవరైతే హెచ్ఐవీతో జీవిస్తున్నారో వారికి సంఘీభావంగా ఉండేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, టీబీ ఆస్పత్రి, పరకాలలోని సీహెచ్‌సీ ఐసీటీసీ సెంటర్లుగా పని చేస్తున్నాయన్నారు. 2024–25లో 55,000ల మందిని పరీక్షించగా.. 100 పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ స్వప్నమాధురి, ఐసీటీసీ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఐసీటీసీ కౌన్సిలర్లు రాపర్తి సురేశ్, రాజేందర్, సంపూర్ణ, సురక్ష కేంద్ర బృందం ఇక్బాల్, భాషా ల్యాబ్ టెక్నీషియన్లు, కరుణ మైత్రాజిటివ్ నెట్‌వర్క్ రవీందర్, మారి, విజయ తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

భక్తజన ప్రవాహం

పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



పుష్కర ఘాట్ వద్ద సరస్వతి విగ్రహానికి నమస్కరిస్తున్న భక్తులు



- సరస్వతి నది పుష్కరాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రద్దీ
- ఆలయాల్లో దర్శనాలు.. పుష్ప గిరి పీఠాధిపతి విద్యా భారతి స్వామి పూజలు
- సుమారు 1.80 లక్షల మంది పుష్కర స్నానాలు.. పర్యవేక్షించిన కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు కావడంతో నాలుగో రోజు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు కాళేశ్వరానికి బారులుదీరారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించి నదీమాతకు చీరె, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలువురు పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పనాలు సమర్పించారు. పుష్కరిని భక్తులతో నిండిపోయింది. స్టాళ్లలో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టు, ఖాదీవస్త్రాలు, పిల్లల ఆటలు, టెంట్‌సిటీలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

1.80 లక్షల మంది భక్తుల స్నానాలు..

వివిధ రాష్ట్రాల నుంచి భారీగా ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచి భారీగా భక్తులు సరస్వతినదిలో పుష్కరస్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు 1.80 లక్షల మంది భక్తులు పుష్కరస్నానాలు చేసినట్లు అధికారుల అంచనా వేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ భక్తులకు కల్పించిన సౌకర్యాలను సమీక్షించారు.



పుష్కర ఘాట్ వ్యూ

నదీహారతికి పెరిగిన భక్తులు..

నాలుగు రోజులుగా సరస్వతిఘాట్‌లో కాశీపండితులతో ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు.

పుష్ప గిరి పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం

పుష్పగిరి పీఠాధిపతి విద్యాభారతిస్వామి సరస్వతి నదిలో పుష్కర స్నానాలు చేశారు. నదికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్దకు రాగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని అభిషేక పూజలు చేశారు.



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

సెలవురోజు పెరిగిన రద్దీ..

సెలవు రోజు కావడంతో రద్దీ పెరిగింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి మీదుగా, మంథని, కాటారం మీదుగా భారీగా వాహనాలు వచ్చాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కార్లు, ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన భక్తులను వీఐపీ ఘాట్ సమీప, ఇప్పలబోరు, బస్టాండ్ వద్ద పార్కింగ్ ప్రాంతాలకు తరలించారు.

- మరిన్ని చిత్రాలు 8లో▸

మారిన యూనిఫామ్ డిజైన్లు

స్వల్పమార్పులతో స్టిచ్చింగ్

- ప్రస్తుతానికి ఒకే జతకు క్లాత్ రాక
- కుట్టుపనికి 31వ తేదీ వరకు డెడ్‌లైన్
- జిల్లాలో 30,922 మంది విద్యార్థులు

విద్యారణ్యపురి/వేలేరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు(2025–26)విద్యాసంవత్సరం అందించే స్కూల్ యూనిఫామ్ డిజైన్‌లో స్వల్ప మార్పులు చేశారు. తరగతుల వారీగా బాలబాలికలకు వేర్వేరు డిజైన్లలో దుస్తులు కుట్టించేందుకు ఇప్పటికే హనుమకొండ జిల్లాలో గ్రామీణ ప్రాంత మహిళ సంఘాల సమాఖ్యలకు క్లాత్‌ను మండలాల వారీగా పాఠశాలల స్థాయిలో అందజేశారు. పట్టణ ప్రాంతంలో మెప్మాకు సంబంధించి టీఎల్ఎఫ్‌లకు అప్పగించారు. క్లాత్‌ను టెస్కో పంపిణీ చేసింది. ఈసారి స్టిచింగ్ డిజైన్‌లో మార్పులను గమనిస్తే.. ముఖ్యంగా చొక్కాలు, లాంగ్ ఫ్రాక్‌లకు పట్టీలు, భుజాలపైన కప్స్ వంటి ప్యాచ్‌లు లేకుండా కుటిస్తున్నారు. స్టిచ్చింగ్ సరళంగా ఉండేందుకు స్వల్పమార్పులు చేశారు.

తరగతుల వారీగా యూనిఫామ్ ఇలా..

ఒకటి నుంచి 5వ తరగతి బాలురకు చొక్కా, నిక్కర్, ఆరు నుంచి 12వ తరగతి వరకు బాలురకు చొక్కా, పాయింట్, ఒకటి నుంచి మూడో తరగతి బాలికలకు చొక్కా, లాంగ్‌ఫ్రాక్, 4, 5 తరగతుల బాలికలకు షర్ట్, స్కర్ట్, ఆరు నుంచి 12వ తరగతి బాలికలకు పంజాబీడ్రెస్ మోడల్‌లో ఉండేలా టాప్ బాటమ్ చున్నీ లేకుండా కుట్టిస్తున్నారు. ఈసారి వేసవి సెలవులకు ముందే యూనిఫాం కుట్టించేందుకు కొలతలు కూడా తీసుకున్నారు. దుస్తులు హెచ్చు తగ్గులు ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తొలుత ఒకే జతకు క్లాత్‌రాక..

యూనిఫాం స్టిచ్చింగ్ కోసం ముందుగా ఒకే జత కోసం క్లాత్‌ను మహిళా సమాఖ్యలకు అప్పగించారు. ఈనెల 31 వరకు స్టిచ్చింగ్ పూర్తి చేసి అందజేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. జిల్లాలో 314 పీఎస్‌లు, 72 యూపీఎస్‌లు, 147 హైస్కూళ్లు, 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూళ్లు, ఒక యూఆర్ఎస్, 25 వరకు ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 30,922 మంది ఉండగా ఇందులో బాలురు 14,852, బాలికలు 16,070 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా.. ప్రతి ఏడాది ఒక్కో విద్యార్థికి రెండుజతల చొప్పున స్కూల్ యూనిఫామ్ అందజేస్తున్నారు. ఈసారి తొలుత ఒక జత పంపిణీ చేసేందుకు స్టిచ్చింగ్ చేయిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక పిల్లలకు అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే రెండో జతకు క్లాత్‌వచ్చే అవకాశం ఉంటుంది.



కుట్టు శిక్షణ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రూ.75తో గిట్టుబాటు కాని కూలి..

ప్రభుత్వం ఒక జత యూనిఫామ్ స్టిచ్చింగ్‌కు రూ.75 చొప్పున చెల్లిస్తోంది. గతంలో ఒక్కోతకు రూ.50 చొప్పున చెల్లించగా గత ఏడాది నుంచి రూ.25 పెంచారు. ఇందులో కుట్టు కూలికి రూ.50, కటింగ్, బటన్స్, కాజలు, ఎంఎస్ సర్వీస్ చార్జి రూ.25 కలిపి రూ.75 ఇస్తున్నారు. బయట టైలర్లు ఒక్కో జత కుట్టడానికి రూ.300 నుంచి రూ.400 తీసుకుంటుండగా ప్రభుత్వం రూ.75 నిర్ణయించడంతో గిట్టుబాటు కావడం లేదని మహిళా సమాఖ్య సభ్యులు పేర్కొంటున్నారు. యూనిఫాంకు కనీసం రూ.150 పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి లభిస్తున్నది..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టే పనిని మహిళా సంఘాలకు ఇవ్వడం వల్ల మాకు ఉపాధి లభిస్తున్నది. నాతో పాటు చాలా మంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎదుగుతున్నాం. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న కూలి రూ.75 ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఆలోచించి ధర పెంచేలా చర్యలు తీసుకోవాలి.

- కీర్తి భాగ్యలక్ష్మి

ఏడాదంతా పని కల్పించాలి..



మహిళా సంఘాల సభ్యుల ద్వారా విద్యార్థులకు యూనిఫాం కుట్టే పనిని కేవలం వేసవిలోనే కాకుండా ఏడాదంతా కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అలాగే ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి గిట్టుబాటు కావడం లేదు. బయట ఒక యూనిఫాం కుట్టాలంటే రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. బటన్లు, కాజాలు, వేయడానికి భీమదేవరపల్లి మండలానికి తీసుకువెళ్లాలి. రవాణా ఖర్చులు కూడా మాపైనే పడుతున్నాయి. జతకు కనీసం రూ.150 చెల్లించేలా చొరవ తీసుకోవాలి.

- వలబోజు శైలజ, షోడాషపల్లి

కానిస్టేబుల్‌కు అభినందనలు



108లో ఎంజీఎంకు తరలిస్తున్న కానిస్టేబుల్

రామన్నపేట: వృత్తి ధర్మంలో భాగంగా మానవత్వం చాటుకున్న ఓ కానిస్టేబుల్ మంచి మనస్సును ప్రజలు అభినందించారు. వివరాల్లోకి వెళ్తే వరంగల్ గోపాలస్వామి గుడి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి దుస్తులు కూడా సరిగ్గా లేక ఎండవేడి తట్టుకోలేక పడిపోగా, స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్ అక్కడికి చేరుకుని బాధిత వ్యక్తికి దుస్తులు తెప్పించి తొడిగి 108 వాహనాన్ని పిలిపించి ఎంజీఎం ఆస్పత్రికి వైద్యం కోసం తరలించాడు. ఇదంతా గమనించిన స్థానికులు సదరు కానిస్టేబుల్ స్పందించి సహాయం చేసిన తీరుకు అభినందనలు తెలిపారు.

క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- విశాల్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

కేయూ క్యాంపస్: తెలంగాణలో క్రీడా రంగాభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుమారుడు నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నాయిని టీ–10 లీగ్ సీజన్–2 క్రికెట్ పోటీలు ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2015లో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో విశాల్‌రెడ్డి మరణించడంతో ఆయన జ్ఞాపకాలను రాజేందర్‌రెడ్డి విశాల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మేయర్ సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న వేం నరేందర్‌రెడ్డి

క్లుప్తంగా

హామీల అమలులో కేంద్రం విఫలం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల పదో మహాసభలకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అందిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ.. ఆ హామీల అమలులో పూర్తిగా విఫలం చెందారన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మనుధర్మ శాస్త్ర అమలుకు కుట్ర పన్నుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిక హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, మర్రి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, సంతోశ్, రాజ్‌కుమార్, బొంత మల్లయ్య, నిమ్మల మనోహర్, ఉట్కూరి ప్రణీత్, విజయ్, రాజనర్సు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

● విజేతలకు బహుమతుల ప్రదానం



మిక్స్‌డ్ డబుల్స్ విన్నర్ మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

జనగామ: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలురు, బాలికా క్రీడాకారులు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్–5, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ట్రెడిషనల్, ఫాస్ట్–5 పోటీలు ఈనెల 17న ముగియగా.. చివరగా మిక్స్‌డ్ డబుల్స్ పోటీలతో ముగింపు పలికారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మహబూబ్‌నగర్(విన్నర్), కామారెడ్డి(రన్నర్), థర్డ్ ప్లేస్‌లో వరంగల్/నాగర్ కర్నూల్ సంయుక్త విజేతలుగా నిలువగా, మూడు కేటగిరీల్లో విజయం సాధించిన టీంలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

కాళేశ్వరం.. జనసంద్రం



నీళ్లారగిస్తున్న మహిళలు

పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు





మొక్కుతున్న యువతి



నది తీరంలో భక్తుల రద్దీ



పుష్కరాలకు వస్తున్న భక్తులు



స్నానం ఆచరిస్తున్న యువతి



స్నానం ఆచరించి మొక్కుతున్న మహిళలు



పిండ ప్రదాన పూజలు చేయిస్తున్న పురోహితులు



స్నానం ఆచరించే ముందు మొక్కుతున్న భక్తులు



నది తీరంలో భక్తుల రద్దీ



వాయినం ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు



నదిలో ప్రమిదను వదులుతున్న భక్తులు



తీర్థప్రసాదం తీసుకుంటున్న మహిళ



సెల్ఫీ దిగుతున్న యువతులు

అన్నదానం.. మహాప్రసాదం

● పుష్కరాల భక్తులకు పలు ట్రస్ట్‌ల నిత్యాన్నదానం
● పన్నెండు రోజుల పాటు ఉచితంగా టిఫిన్, భోజనం
● భక్తుల ఆకలి తీరుస్తున్న సత్రాలు

కాటారం /మల్హర్: అన్నం పరబ్రహ్మ సర్వాపం. ఆకలితో ఉన్న వారికి ఒక పూట భోజనం పెట్టినా చాలు ఎంతో పుణ్యం లభిస్తుంది. అందుకే సేవాభావంతో పలువురు ప్రముఖ దైవక్షేత్రాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే మాదిరి ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల నేపథ్యంలో ముక్తీశ్వరాలయ సమీపంలో దాదాపు 8 చోట్ల అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అన్నదాతలు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసి భక్తుల కడుపునింపుతున్నారు. ఒక్క పూటకు నాలుగు నుంచి ఆరు వేల మంది భక్తులకు ఉచిత అన్నదానాలు చేస్తున్నారు.

ప్రతీ రోజు టిఫిన్, అన్నదానం..



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఆర్యవైశ్య, బ్రహ్మణ, ఈశ్వరకుమారి, వాసవీ క్లబ్, ఇతరాత్ర ట్రస్ట్‌ల ద్వారా ఏర్పాటు చేసిన అన్నప్రసాద సత్రాల ద్వారా భక్తులకు ప్రతీ రోజు టిఫిన్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఏదో ఉచిత భోజనం అందిస్తున్నామనే కాకుండా నిర్వాహకులు నాణ్యతతో కూడిన రుచికర భోజనం అందిస్తున్నారు. ఉదయం పలు రకాల అల్పాహారంతోపాటు భోజనంలో రెండు రకాల కూరలు, పప్పు, సాంబారు, పెరుగు, స్వీట్లు, పచ్చడి పెడుతున్నారు. రుచికరం, పరిశుభ్రంగా ఉండడంతో భక్తులు సత్రాల్లో భోజనం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

భోజన సౌకర్యం బాగుంది..



సరస్వతీనది పుష్కరాలకు రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా వచ్చాం. అన్నదాన సత్రాల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేస్తున్నాం. చాలా రుచిగా, శుభ్రంగా ఉంది.

– అనురాధ, భక్తురాలు, మంచిర్యాల

సేవలు అభినందనీయం..



పుష్కరాలకు పిల్లలతో కలిసి చాలా దూరం నుంచి వచ్చాం. మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బంది అవుతుందని ఆందోళన చెందాం. కానీ తీరా ఇక్కడికి వచ్చి చూస్తే అన్నదాన సత్రాల్లో భోజనం లభించింది. సమయానికి మా ఆకలి తీరింది. అన్నదానం నిర్వాహకుల సేవలు అభినందనీయం.


– శ్రీనివాస్, భక్తుడు, కరీంనగర్

19 సంవత్సరాలుగా అన్నదానం..

కాళేశ్వరం వచ్చే భక్తులకు భోజన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో మా తండ్రి గుడాల కృష్ణమూర్తి 2007లో కాళేశ్వర ముక్తీశ్వర శ్రీ వాసవి అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. 19 సంవత్సరాలుగా ప్రతీ పుష్కరానికి భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. మిగతా రోజుల్లో అనేక మంది కాళేశ్వరం వచ్చే ఆర్యవైశ్య భక్తులకు భోజనం అందజేస్తున్నాం. ప్రతీ రోజు భోజనం అందించడం ఆనందంగా ఉంది.

– జానకీమణికుమార్, సత్రం నిర్వాహకురాలు

ఆనందంగా ఉంది..



కాళేశ్వరం వచ్చే భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉంది. 2015లో గోదావరి పుష్కరాల్లో, 2022 ప్రాణహిత పుష్కరాల్లో కూడా 12 రోజుల పాటు కాళేశ్వరంలో అన్నదానం చేశాం. 12వ పుష్కరం సరస్వతీనది పుష్కరాలకు కూడా అన్నదానం చేస్తున్నాం. భక్తుల కడుపు నింపడం మాకు ఆనందంగా ఉంది.

– సోమ వెంకటయ్య,అన్నదాన, నిర్వాహకుడు

ప్రముఖుల పుష్కర స్నానం..



సరస్వతీనదిలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి దంపతులు



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న సినీనటుడు రాజేంద్రప్రసాద్

కాటారం/కాళేశ్వరం: పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా ఆదివారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ప్రముఖ సినీనటుడు రాజేంద్ర ప్రసాద్, జెన్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ అనురాధ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. సరస్వతి(వీఐపీ)ఘాట్‌లో పుష్కర స్నానం చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం చేరుకుని స్వామి వారికి, సరస్వతీమాతా, శుభానందాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హైకోర్టు జడ్జి సుధాకు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే స్వాగతం పలికి మొక్కను బహూకరించారు.

నిఘా నీడలో కాళేశ్వరం



కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల సందర్భంగా పోలీసులు ముందస్తు నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దులో కాళేశ్వరం ఉండడంతో అంతర్రాష్ట్ర వంతెన నుంచి మొదలు.. శ్రీకాళేశ్వర ముక్తీశ్వర దేవాలయం, పరిసర ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్, ప్రధాన రహదారుల్లో సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి నిత్యం పరిశీలిస్తున్నారు. ఫలితంగా ఇప్పటి వరకైతే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

ఎండవేడితో భక్తుల అస్వస్థత



వీఐపీ ఘాట్ వద్ద అస్వస్థతకు గురైన భక్తుడిని తరలిస్తున్న సింగరేణి రెస్క్యూ సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో ఎండ వేడితో భక్తులు అస్వస్థతకు గురవుతున్నారు. పుష్కరాలో భాగంగా నాలుగో రోజు ఆదివారం 8 మంది భక్తులు ఎండవేడికి అస్వస్థతకు గురికాగా 108లో కాళేశ్వరం పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో ఆదివారం 156 మందికి ఓపీ పరీక్షలు నిర్వహించగా 30 మంది భక్తులను అడ్మిట్ చేసుకున్నారు. కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన క్యాంపుల ద్వారా సుమారు 4వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించామని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ తెలిపారు.

కలెక్టర్ జాయ్ రైడ్..



జాయ్ రైడ్‌కు వెళ్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ జాయ్ రైడ్ చేసి సరస్వతీనది పుష్కర సదుపాయాలను పరిశీలించారు. ఆదివారం ఉదయం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి హెలికాప్టర్‌లో పుష్కర పరిసరాలు పరిశీలించారు. పుష్కర ఘాట్‌లు, రహదారి సదుపాయాలు, శానిటేషన్, పారిశుద్ధ్య చర్యలు, టెంట్ సిటీ, స్టాళ్లు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు హెలికాప్టర్ ద్వారా త్రివేణి సంగమం, కాళేశ్వర దేవస్థానం, కాళేశ్వరం చుట్టు పక్కల అడవులు, తదితర అందాలను వీక్షించడానికి జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాక

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం రోడ్డు మార్గాన కాళేశ్వరం రానున్నారు. ఉదయం 10.30 గంటలకు కాళేశ్వరం చేరుకుని పుష్కర స్నానం ఆచరించిన అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. 12 గంటలకు తిరిగి కరీంనగర్‌కు వెళ్లనున్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా సోమవారం కాళేశ్వరం రానున్నట్లు సమాచారం.

ఓరుగల్లు ఉద్యమాల గడ్డ

● ఎంపీ అసుదుద్దీన్ ఓవైసీ



మాట్లాడుతున్న ఎంపీ అసుదుద్దీన్ ఓవైసీ

న్యూశాయంపేట/రామన్నపేట : ఓరుగల్లు ఉద్యమాల గడ్డ.. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వరంగల్ ప్రజలు ఐక్యంగా ఉండి ఇతర పార్టీలతో కలిసి ముందుకు సాగేలా అడుగులు వేయడం అబినందనీయమని ఎంపీ అసుదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం రాత్రి వరంగల్ ఎంజీఎం సమీప ఇస్లామియా గ్రౌండ్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 22న మహిళలతో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25న రాష్ట్ర హ్యూమన్ చైన్(మానవహారం), జూన్ 1న ఇందిరా పార్కు వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సభలో బీఆర్‌ఎస్ నాయకులు సోహైల్, ముస్లిం మత పెద్దలు మీర్ ఇద్రిసాలీ, ఉమర్ అబేదిన్, మౌలానా ఫసీయోద్దీన్ ఖాస్మీ, జలీల్‌ఖాన్, సయ్యద్ అబ్దుల్ సుబాన్, అబ్దుల్ ఖుద్దుస్, సయ్యద్ మసూద్, జుబేర్, సీపీఐ, న్యూడెమోక్రసీ నాయకులు మేకల రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో అధిపత్య పోరు

ఈ బహిరంగలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య అధిపత్య పోరు కనిపించింది. తమను సభా వేదికలో ప్రసంగించకుండా అడ్డుకుంటున్నారని ఇరు పార్టీల మద్దతుదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో లా బోర్డు పెద్దలు కలుగజేసుకుని వివాదాన్ని సద్దుమణిగించేలా చేశారు.

సెల్‌ఫోన్ లైట్లతో మద్దతు

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బహిరంగ సభకు హాజరైన ముస్లింలు సెల్‌ఫోన్ లైట్లు వెలిగించి మద్దతు తెలిపారు. సభ ప్రారంభంలో పహల్గాం ఉగ్రవాద దాడితో మృతిచెందిన భారతీయులకు, యుద్ధంలో మృతి చెందిన సైనికుల మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉద్యమ జీవి నల్లెల రాజయ్య

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్యనవీన్, తదితరులు

విద్యారణ్యపురి: ఉద్యమ జీవి నల్లెల రాజయ్య చిరస్మరణీయుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన 'ప్రజల మనిషి నల్లెల రాజయ్య' పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. సి. చంద్ర ప్రధాన సంపాదకుడిగా, అనిశెట్టి రజిత, డాక్టర్ కెబి. చంద్రభాను, బిల్ల మహేందర్, పిట్ట సాంబయ్య, రౌతు అజయ్‌కుమార్ సంపాదక వర్గం సభ్యుల ఆధ్వర్యంలో వ్యాసాల సంపుటి(పుస్తకం)ని రూపొందించారు. కేయూ రిటైర్డ్ ఆచార్యుడు బన్నఅయిలయ్య,ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి, టీపీఎఫ్ కన్వీనర్ రమాదేవి మాట్లాడారు. కవి కోడం కుమారస్వామి పుస్తకాన్ని సమీక్షించారు. వరంగల్ రచయితల సంఘం కార్యదర్శి దండ్రె రాజమౌళి, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు భిక్షపతి, తిరుపతయ్య, సాంబయ్య, ఉదయ్‌సింగ్, మెట్టురవీందర్, జీడి. సారయ్య, మార్కశంకర్‌నారాయణ, కె. శంకర్‌రావు, వి. దిలీప్, బండారు సుజాత, బోనగిరి రాములు, ఎ. విద్యాదేవి, రాజేంద్రప్రసాద్, కుటుంబీకులు సుగుణ, వెన్నెల, సూర్య పాల్గొన్నారు.